# జ్ఞానులు

తూర్పు దేశపు జ్ఞానులు ఆ నక్షత్రాన్ని చూసి అత్యంత సంతోషంతో యింటిలోకి వచ్చి, తల్లి మరియను, శిశువు యేసును చూసి ఆయనకు సాగిలపడి నమస్కరించి, తమ వద్ద ఉన్న బంగారం, సాంబ్రాణి, బోళములను బహుమానాలుగా సమర్పించారు. మత్తయి 2:10-11

- జ్ఞానులు తూర్పు దేశమునకు సంబంధించినవారు. వీరు స్వప్నములకు, దర్శనములకు అర్థం చెప్పువారు. గొప్ప ఖగోళశాస్త్రజ్ఞులు, రాజవంశమునకు చెందినవారు.
- యూదులు మెస్సీయ పుట్టుకను గుర్తించలేదు. కాని అన్యదేశము నుండి వచ్చిన జ్ఞానులే గుర్తుపట్టారు.
- ప్రాచీన బబులోను నగర ప్రాంతములోను, పార్తియా దేశమునకు చెందినవారు. అందుచేత పాతనిబంధన ప్రవచనాలతో వీరికి పరిచయముంది.

## 1. జ్ఞానులు ఆయనను పూజించుట

- విరిగి నలిగిన హృదయం కలిగి ఆయనను ఆరాధించుటయే నిజమైన క్రిస్మస్ , జ్ఞానులు రాజవంశమునకు చెందినవారైనప్పటికీ తమ్మును తాము తగ్గించుకొని సాష్టాంగ నమస్కారం చేసి, మహిమా, ఘనతా ప్రభువుకు చెల్లించినారు. యేసు బాలుని యెదట సాగిలపడుటకు వారి జ్ఞానం, విద్య, సామర్థ్యం, అహం అడ్డురాలేదు. రండి నమస్కారము చేసి సాగిలపడదాం. (కీర్తన 95 : 7)

## 2. జ్ఞానులు కానుకలు సమర్పించిరి

జ్ఞానులు తెచ్చిన అర్పణలు ఎంతో విలువైనవి, ఆ విలువైన అర్పణలు బంగారము, సాంబ్రాణి, బోళములను మరియకు కాదు, యేసు ప్రభువుకు సమర్పించిరి.

- **బంగారము** : క్రీస్తు రాజరికమునకు గుర్తు, బంగారము అమూల్యమైన, విలువైన లోహము. రాజులకు బహూకరించబడుతుంది. మన యేసు రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు. ( మత్త 2: 2, కీర్తన 472, 7-8, 1తిమో 6 : 15)
- **సాంబ్రాణి** : సాంబ్రాణి క్రీస్తు ప్రధానయాజకుడని గుర్తు. యాజకుడు అనగా మధ్యవర్తి, ప్రజల పక్షమున విజ్ఞాపన చేసేవాడు. ఆదిలో ఆదాము ద్వారా తెగిపోయిన బంధమును కడపటి ఆదాము ద్వారా పునఃనిర్మించబదెను. (హెబ్రీ 4 : 14, రోమా 8: 33 - 34, ఎఫెసి 2: 14 - 18)

- **బోళము** : బోళము క్రీస్తు శ్రమలకు, మరణమునకు సూచన. ప్రభువు ఈ లోకములో జీవించి, చివరిలో మానవుని కొరకు తన ప్రాణం పెట్టి సిలువలో మరణించెను. ( మార్కు 10: 45, యోహా 18- 19 అధ్యా )

జ్ఞానులు.... దేవుడు వారికిచ్చిన తలాంతులను, జ్ఞానమును, సమయమును, ధనమును, హృదయమును, యేసు పాదపద్మముల ఎదుట సమర్పించి పూజించిరి. నీ హృదయమును సమర్పించితివా ?.

క్రీస్తును పూజించకుండా నీ హృదయాన్ని సమర్పించుకొనకుండా, క్రిస్మస్ పాటలు పాడుచూ, క్రొత్త బట్టలు ధరించి దేవుని ఆలయమునకు వెళ్ళి వస్తే, ఆ పండగకు అర్థం లేదు. అంతేగాక నీకు కూడా ఆశీర్వాదమూ లేదు. గనుక మన హృదయాన్ని మాత్రమే కాక మన కానుకలను, దశమ భాగములను, మ్రొక్కుబడులను, ప్రథమ ఫలములను ప్రభువుకు మనఃస్పూర్తిగా సమర్పించాలి. ఇదియే నిజమైన క్రిస్మస్.